# వసంతాన్వేషణ

డాక్టర్ దాశరథి

వసంతం వచ్చేసిందని ప్రకటించేశారు;
వసంతానికి స్వాగతం చెప్పడానికి ఎదురేగాను

వనాంతాలకు వచ్చిందనుకుని అటు వెళ్ళాను
వనాలు నరికిపారేశారు, జనాలు బస చేశారు

వసంతం, కవుల కవితల్లోనైనా వుంటుందనుకున్నాను
ప్రళయార్భటాలు, ప్రభంజనాలు దర్శించుకున్నాను!

విషాదాంత, విరోధాంత, వివాదాంత రచనలు
విప్పితే పత్రికా ప్రపంచంలో కోకొల్లలు!

ఇంతకీ, వచ్చింది, వచ్చింది అన్న వసంతం యెటుపోయినట్లు?
గొంతెత్తి తీయతీయగా కోయిలలు యెక్కడ పాడినట్లు?

మండిపోయే ఈ యెండల్లో వసంత సుకుమారి
గుండె పగిలి మండి మసిబొగ్గైపోయిందా మరి?

కాళిదాస ఋతుసంహారంలోని కమనీయ వసంతం
కాలం మార్పుకి భయపడి రావడం మానేసిందేమో! పాపం!

వనితా హృదయాల్లో వసంతంకోసం గవేషించాను
ప్రణయానికి బదులు ప్రళయాన్నే సాక్షాత్కరించుకున్నాను

అభినవ్య చిత్రకారుడి చిత్రాల్లో అన్వేషించుకున్నాను
అయోమయ వికృతరూపాలు చూసి భయపడ్డాను

నవగాయకుడి గళంలో ప్రశాంత వసంతరాగం వెతికాను
నన్ను జడిపించే హాలాహల కోలాహలరాగం విన్నాను!

మాడిపోయే గుండెల్తో మహీమండలం అంతా గాలించాను
మోజుపడిన లోకంలో నలుమూలలా సంచరించాను

ఆఖరుకి యెవరికీ పట్టని పంచాంగం విప్పిచూశాను
అదుగో! "వైశాఖమాసః వసంతఋతుః" అని చదివాను

పంచాంగంలో, భయపడి దాక్కున్న వసంత ఋతువును
పంచమ ప్రాణంగా దాక్కొని గుండెల్లో దాచుకున్నాను!

# యుగధర్మం



ఇందూరమణ

"మేఁ!.... మేఁ!"

దిక్కులు పిక్కటిల్లాయి. భువనభోంతరాలూ దద్దరిల్లిపోయాయి ఆ అడవి అడవంతా అల్లల్లాడి పోయిందా అరుపులకు.

ప్రాణభీతితో అరచిన మేక అరుపులకు ఇహాని కొచ్చాడు అప్పన్న.

చాకిరేవు కొండమీదకు మేకల మందల్ని తోలుకువెళ్ళి వాటిని అడవిలో మేతకు వదిలి తను ఓ చిన్న బండమీద కాళ్ళు ముడుచుకుని కూర్చున్నాడు.

రోజూ ఉదయం లేవగానే గేదెల దగ్గర పాలు పితికి కాఫీ దుకాణాలకు - చిల్లర వాడకందార్లకు పంపిణీ చేసిన తర్వాత — తమ పాలవాడకం ఆసామీల ఇళ్ళదగ్గర్నుండి 'కుడితి' తీసుకురావడం- దానికి వారికి ప్రతిగా ఆ ఇళ్ళవాళ్ళకు 'కల్లాపు'కు కావలసిన 'పేడ' తీసుకు వెళ్ళి అందించటం అయింతర్వాత -

ఉదయం ఎనిమిదయ్యేసరికి చద్దన్నం తినేసి - మధ్యాహ్నానికి 'నోడి'అంబలి పట్టుకొని మేకల మందని అడవికి తోలుకువెళ్ళటం పరిపాటి.

సాయంత్రం ఆరయ్యేసరికి మందని మళ్ళించి ఇంటికి చేరుకున్న తర్వాత మళ్ళా గేదెలదగ్గర పాలు పితికి సరఫరా చేసిన

తర్వాత - ఇంటికి వాడకానికి కావలసిన మంచినీళ్ళు బజారు నూతిదగ్గర నుండి కావిడితో మోయటంకూడా అప్పన్న దిన చర్యే!

ఇంట్లోని చిల్లర మల్లర పనులు సతీమణి సర్దుకుపోయేది.

ప్రతిరోజూ ఒకే విధమైన పనికావడం మూలాన అప్పన్నకి విసుగు - విరామం తెలియటంలేదు. తన పని నిర్విఘ్నంగా సాగిపోయిన తర్వాత ఏ రాత్రికో - అప రాత్రికో తన గుడిసెను చేరుకొనేవాడు.

శ్మశాన నిశ్శబ్దం ఆవరించుకున్న ఆ అడవిలో భయంకరంగా మేక అరుపుల మోత.

ఆ మేక అరుపులకు బండమీదనుండి ఆత్రంగా లేచాడు అప్పన్న. ఆదరా-బాదరా మేకల మందనంతా చుట్టబెట్టి చూసాడు.

అక్కడక్కడా రెండేసి మేకలు కలిసి మేస్తున్నాయి. ఆ అరుపు ఎక్కడి నుండి వచ్చిందో అర్థంకాలేదు అప్పన్నకి. కొండరాళ్లలో 'పలుకురాయి' లుండటం మూలాన మేక అరచిన అరనిమషం వరకూ ఆ అరపులు ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి.

ఆ రాత్రంతా అడవంతా గాలించ సాగాడు అప్పన్న.

ఆ అరుపు మేకపోతుది. అది అసలే పిరిగ్గొడ్డు. ఏమైందో ఏవిటో? అప్పన్న మనసులో భయం పీకుతోంది.

ఏ మేకైనా అలా ఎందుకు అరుస్తుందో అప్పన్నకు బాగా తెలుసు. ఏ మేకవో వాటి కళ్లబడ్డప్పుడు భయంతోనూ - చావబోతున్నప్పుడు బాధతోనూ అరుస్తాయి. అలాగే ఇదీ అరిచింది.

ప్రతీ తుప్పా విడవకుండా వెతుకుతున్నాడు అప్పన్న. మేకలన్నీ తమ మానాన అవి మేస్తున్నాయి. మేకలన్నింటినీ ఒకదగ్గర గుంపుగా చేర్చాడు. గబగబా లెక్కపెట్టాడు. మొత్తం మందలో రెండు తక్కువ ఉన్నాయి. తన మేకలమందలో రెండు తక్కువ కనిపించేసరికి అప్పన్నకి ముచ్చెమటలు పోశాయి.


పేరుపేరునా ఒక్కోదాన్నీ పరిశీలించి చూసాడు. 'బొకడపోతు' ఎక్కడా కనిపించలేదు. దానితోపాటు 'పొడమేక' జాడ కూడా లేదు. ఆ రెండే తక్కువ.

'బొకడపోతు' కనిపించక పోయేసరికి అప్పన్న కళ్లంబడ నీళ్లు ఉబికాయి, అదంటే అప్పన్నకి ప్రాణం. దాన్ని చిన్నప్పట్నుండీ తన చేతులతో పెంచాడు. దాన్ని కన్న మూడోనాడే దాని తల్లిని ఈ మెకవే పొట్టన పెట్టుకుంది. చిన్నపిల్ల కావటంచేత వేరే మేకలు ఏవీ దాన్ని తమ దగ్గరకు రానిచ్చేవి కావు.

కొన్నాళ్లు బలవంతాన ఏదో తల్లి మేకని రాటకు కట్టేసి కదలకుండా కాళ్లు పట్టుకొని బొకడమేకపిల్లని దాని దగ్గర ఉంచేవాడు అప్పన్న.



D. L. Book Lending ...y
Marripalem, Visakha-18




బలవంతాన ఎవరు - ఎవరినైనా ఏం చేయగలరు? దేన్నైనా ఎలా సాధించగలరు?

ఆ తల్లిమేకకూడా తనని కట్టేసి బలవంతంగా వేరే మేకపిల్లకి తన పాలు త్రాగించేసరికి తన పిల్లకి కాకుండా వేరే దానికి ఇవ్వడం ఇష్టంలేక ఎగసేపేది.

ఇలా కాదని అప్పన్న ఎలాగో తంటాలువడి అన్ని తల్లిమేకల దగ్గర నుండీ పాలు పితికి పట్టేవాడు.

కొంచెం ఎదిగిన తర్వాత తలపోటు నేర్పాడు. తన చేత్తో దాన్ని గుద్ది దానికి కోపం వచ్చేటట్టుచేసి పౌరుషం తెప్పించేవాడు అప్పన్న. నానా యాతనపడి చివరికి దానికి పోట్లు నేర్పాడు.

ఆ నోరులేని జీవానికికూడా అప్పన్న అంటే మాలిమి అయింది. అప్పన్నని తప్ప వేరే ఎవరినీ తన దగ్గరకు రానిచ్చేదికాదు. దాన్ని చూసి భయపడేవాళ్లు అందరూ.

ఒకరోజు -

ముద్దుగా ముద్దొస్తుందని దగ్గరకు వెళ్లి బొకడపోతును ముట్టుకోబోయాడు అప్పన్న యజమాని అయిన సూకరాజు. ఏమనుకుందో - ఏమోగానీ ఒక్కసారి నాలుగడుగులు వెనక్కి వేసి ముందుకు వచ్చి ఎగిరి పొడిచింది. ఆ పోటు వూపుకు వెళ్లి వెల్లికిలా పడిపోయాడు సూకరాజు. అంతలో అప్పన్న అక్కడే ఉండడంతో పరుగున వెళ్లి దాన్ని పట్టుకున్నాడు.

ఆ విషయం గుర్తొచ్చినప్పుడల్లా అప్పన్నకి నవ్వు పుట్టుకొస్తూంటుంది. బొకడపోతు కనిపించక పోయేసరికి అంత బాధలోనూ ఆ విషయం గుర్తొచ్చి నవ్వాపుకోలేకపోయాడు.

"దానికి తనంటే ఎంత మాలిమి! అది

తనకి ఎలా మచ్చికయిపోయింది?' మనిషిని మనిషే గౌరవించని ఈ రోజుల్లో ఓ మూగజీవి తనకి విలువ ఇచ్చేసరికి ఆనందంతోపాటు ఆశ్చర్యపోయేవాడు అప్పన్న.

అలాంటి బొకడపోతు కన్పించక పోయేసరికి నిజంగానే బాధపడ్డాడు అప్పన్న. పొడమేక కన్పించకపోతే యజమాని ఏఁవంటాడో? అని బాధపడ్డాడు. కానీ, బొకడపోతు – అంబోతు లాంటి బొకడపోతు కన్పించలేదంటే ఊరుకుంటాడా తన యజమాని? అగ్గిమీదగుగ్గిలఁవై పోడూ?! అప్పనీ, అమ్మనీ తిట్టిపొయ్యడూ?!

తన యజమాని శివతాండవాన్ని గుర్తు చేసుకున్న అప్పన్నకి కంపరం ఎట్టుకుంది. ఒకవేళ దాన్ని ఏ మెఖఁవో పొట్టన బెట్టుకుంటేనో?! అమ్మో! ఇంకేఁవన్నా ఉందా? – దాని ఖరీదు ఏ అయిదొందలో అని తనమీద రుద్ది ముక్కుపై గుద్ది వసూలు చెయ్యడూ?!

ఆ మందని అలాగే అక్కడ వదిలి ప్రతీ తుప్పా వెతుకుతూ అడవంతా గాలించాడు అప్పన్న.

అప్పటికే చీకటితెరలు అలముకుంటున్నాయి. అది కొండప్రాంతం కావడం వలన చీకటి చిక్కగా ఉంది.

ఎక్కడో – ఏదో మూలన తనకి బాగా పరిచయమున్న వాసన ముక్కుపుటాల్ని అదరగొట్టేసరికి ఆ పరిసరప్రాంతాల్లోని తుప్పల్ని మరింత పరిశీలించి చూసాడు అప్పన్న.

ఏ కీలు కాకీలు వేరుచేయబడి తోలు తప్ప ఏఁవీ మిగల్ని పొడమేక శరీరం కన్పించింది. అప్పన్నకి ముచ్చెమటలు పోశాయి.

ఇంతకు పూర్వంకూడా చాలా మేకల్ని కొట్టింది మెఖం. కానీ, ఏ మేకనీ ఆనవాలుకూడా మిగల్చకుండా తిన్నదే గాని, ఇలా వదిలి వెళ్ళలేదు. తన పని పూర్తి కాకుండానే ఎలా? – ఎందుకు? వదిలి వెళ్ళిపోయిందో అప్పన్నకి అర్థంకాలేదు.

బొకడపోతుకోసం వెదకాలనుకున్నా అప్పటికే చీకటి దట్టంగా ఆవరించుకుపోయింది. దారి కానరాక అడవిలో చిక్కుపడిపోతే మిగతామందని కూడా కాయడం కష్టం.

ఆ ఆలోచన మదిలో మెదిలేసరికి చచ్చిన పొడమేక శరీరాన్ని బుజానవేసుకొని మందని మళ్లించాడు అప్పన్న.

* * *

అప్పన్న-

ఎక్కడ పుట్టాడో–ఎవరికి పుట్టాడో ఎవరికీ తెలీదు. పదేళ్ల వయసులోనే పని వెదుక్కుంటూ వచ్చిపడ్డాడు. అప్పన్న యజమాని పేరు– నూకరాజు. పేరు చివర రాజన్నంత మాత్రాన అతను రాజవుతాడా? వృత్తిరీత్యా నూకరాజు రైతు అయినా రకరకాల వ్యాపారాలు చేసి కాస్త పైకెదిగిన వ్యక్తి.

పదిహేనేళ్లప్పుడు అప్పన్న తన పంచన చేరినప్పుడే అన్ని పనులూ పురమాయించి 'ఇంకా నీకు ఖాళీగా తోస్తే ఈ మేకను మేపుతూ ఉండమని' ఒక చిన్న మేకపిల్లని ఇచ్చాడు నూకరాజు. స్వతహాగా స్వామి భక్తుడయిన అప్పన్న కళ్లల్లో వత్తులుపెట్టుకొని ఆ మేకపిల్లని ఇవ్వాల్టికి మేకలమందని చేశాడు.

ఆనాడు – నూకరాజు అయిదు రూపాయలు పెట్టి మేకపిల్ల కొని ఇస్తే, ఈ రోజు అయిదువేలకు పైచిలుకు ఖరీదు చేసే మేకలమందని చేసాడు అప్పన్న.

మేదిపట్టడం చేతగాని నూకరాజు తనకున్న పొలాన్ని కౌలుకు ఇచ్చేసి చిల్లరమల్లర వ్యాపారాలు సాగిస్తూ గడుపుతున్నాడు – గడిస్తున్నాడు.

అప్పన్నకి ఊరికినే తిండీ-బట్టా కాక నెలకో వంద చేతిఖర్చుక్రింద చెల్లించడం దండగనిపించి నాలుగయిదు గేదెల్ని కొని వాటిని కూడా అప్పన్నకి అప్పగించాడు. ఆ గేదెల పాలు 'టీ' దుకాణాల వర్తకులకు, ఇతర ఇళ్లకు నెలసరి వాడకంవేసి ఆ సొమ్ము వసూలుచేసి అమ్మగారి చేతిలో పొయ్యాలి.

పొద్దస్తమానం ఎంత గొడ్డుచాకిరీ చేసినా అప్పన్నకు విసుగు అన్పించేది కాదు. చిన్నప్పట్నుండీ పెరిగి – పెద్దయిన ఇంటి బాగుకోసం – కుటుంబం మేలుకోసం తనూ ఆ ఇంట్లో ఓ వ్యక్తనే భావనతో ప్రతీ పనినీ 'నాదంటూ' కష్టపడడం నేర్చుకున్నాడు అప్పన్న.

నా అన్నవాళ్లు ఎవరూ లేని అప్పన్నకు తల్లీ, తండ్రీ, దైవం సమస్తం నూకరాజే అయి పెంచడం – తన కన్నకొడుకులా చూసాడన్న నమ్మకం అప్పన్నలో నాటుకుపోయింది.

అప్పన్న వయసులో అడుగుపెట్టేసరికి ఇంటి నిమీద కొంత శ్రద్ధ తగ్గినట్టు నూకరాజుకు అనుమానం వచ్చేసరికి వెంటనే అప్పన్న కులానికి చెందిన అమ్మాయిని చూసి మూడుముళ్లూ వేయించేసాడు.

యజమాని తన మేలుకోరి – తనని ఇంట్లో ఒక వ్యక్తిగా తలచి కదా పెళ్ళి చేశాడనుకున్నాడు అప్పన్న.

ఆ రోజునుండి ఆ దంపతులిద్దరూ నూకరాజుగార్ని దేఁవుడిగా భావించి సేవలు చేసుకోసాగారు.

పెళ్లయిన తర్వాత ఇంట్లో పని తన భార్యకు అప్పగించి, బైటపనంతా తను చక్కబెట్టుకొనేవాడు.

డబ్బుతో లావాదేవీలు తప్ప వేరే పనంతా అప్పగించాడు నూకరాజు. అప్పన్నకు పెళ్లయిన మరునాడే తన ఇంటి వెనుక చిన్న గుడిసె వేయించి యిచ్చాడు.

పొద్దస్తమానం తమపని తాము చేసుకొని రాత్రయ్యేసరికి తమ పూరిగుడిసెని చేరుకొని కష్టసుఖాలు చర్చించుకునేవారు భార్యాభర్త లిద్దరూ.

కౌలుకు ఇచ్చిన భూమిని కూడా తిరిగి తీసుకొని అప్పన్నకు అప్పగిస్తూ ఇలా అన్నాడు నూకరాజు.

"ఒరేయ్! నీకూ పెళ్ళయింది. పెళ్ళాంవూ ఉంది. ఎంతకాలం నా ఇంట్లో తిండి తిని– నా కోసం బ్రతికి బట్టకడతావ్? నే నిచ్చే వందా నీకే చాలదు.

ఇకనుండి మన పొలం కూడా నువ్వే పండించుకో. సంవత్సరానికి సరిపడా ధాన్యం నువ్వు తీసుకొని మిగతా ధాన్యం అమ్మేసి డబ్బు అమ్మగార్కి ఇచ్చేయి. ఇకనుండీ నీకు చేతి ఖర్చుకి ఏభై ఇస్తూ మిగతాది నీ పెళ్ళాంపేర బ్యాంకిలో వేస్తాను. సరేనా?"

ఆవేళ– తన యజమాని– తన్ని తన ఎదురుగా కూర్చోబెట్టుకొని బోధించిన బోధన సంతోషంలో ముంచెత్తింది అప్పన్నని.

అంతవరకూ తను దాచుకున్న డబ్బుల్తో ఇంట్లోకి కావలసిన వస్తువులు– పట్టిమంచం, స్టీలుసామానులు, వంట పాత్రలు ఇతరత్రా సామానులు కొని పడేసాడు అప్పన్న.

ఉదయానే భార్య లేచి వంటచేసి తన యజమానిగారింటికి పోతుంది. తిరిగి సాయంత్రం వేగంగా వచ్చి వంట చేసేస్తుంది. మధ్యాహ్నం భోజనానికి వచ్చి క్షణం నడుంవాల్చి తిరిగి రెండు గంటలకల్లా అక్కడుండాలి.

'పాపం! తనని చేసుకొని తనూ కష్టపడుతోంది!' అప్పుడప్పుడూ ఆ ఆలోచన వచ్చినప్పుడు అప్పన్నకు బాధ కలిగేది.

'ఎక్కడో పుట్టి– ఇక్కడ పెరిగి– పెళ్ళిచేసుకొని తనూ– తన భార్యా– తన ఇల్లూ– వాకిలీ–' భావిజీవితం గురించి కలలు కంటూ జీవించసాగాడు అప్పన్న.

* * *

"నువ్వు మందని ఎందుకు తోలు కెళ్ళావ్?!" కుర్చీలో నుండి లేవకుండానే ఘీంకరించాడు నూకరాజు. అతని ప్రక్కనే అతని సతీమణి పార్వతమ్మ నిలబడి ఉంది. నూకరాజు కెదురుగా తలపాగా చుట్టిఉన్న తలని దించుకు నిలబడ్డాడు అప్పన్న.

"…………" యజమాని అన్న ప్రతీమాటా చెవులు రిక్కించుకు విన్నా నోరు మెదపలేదు అప్పన్న.

"మందని అడవికి తోలుకెళ్ళి కలలు కంటూ కూర్చుంటే ఎలా అవుతుంది? అలాంటప్పుడు చాతకాదని కాళ్ళు ముడుచుకొని ఇంట్లో కూర్చోవాలి…." క్షణం ఆగి…. "మొఖం దీన్ని తింటుంటే చూస్తూ కూర్చున్నావా?…. ఏంవిట్రా? ఉలకాపలకవ్! మంకిబుక్కడంలాగా–! మట్టికొట్టుకుపోయిందా నోట్లో. నేను అడుగుతున్నది నిన్నే. అర్థమవుతోందా?!" కళ్ళల్లో నిప్పులు కురిపిస్తూ లేచాడు కుర్చీలోంచి నూకరాజు.

జరుగుతున్న తతంగమంతా వంట గది ద్వారం దగ్గర నిలబడి గమనిస్తోంది అప్పన్న భార్య సూరమ్మ. భర్త దీనావస్థని చూసేసరికి సూరమ్మ కళ్ళనీళ్ళు కుక్కుకుంది. మనిషంత మనిషిని పట్టుకొని నానా దుర్భాషలూ ఆడుతుంటే సూరమ్మ మనసు సహించటంలేదు.

'ఏదో– జరిగిపోయిన చిన్న తప్పుకు ఎంత పెద్ద రాద్ధాంతం?' మనసులోనే గొణుక్కుంటోంది సూరమ్మ.

నోట్లో చీరచెంగు కుక్కుకుని నిలబడి చూస్తోంది. భర్త దీనపరిస్థితిని చూస్తోంటే సూరమ్మకి కళ్ళనీళ్ళు ఆగటంలేదు. కట్టలు త్రెంచుకోబోతున్న దుఃఖాన్ని చీర చెంగుతో నొక్కిపట్టి శిలలా నిలబడిపోయింది.

"అడివంతా గాలించానయ్యా! చీకటి పడ్డ తర్వాత పొడమేక కన్పించింది. ఇంకా చీకటిపడినదాకా ఉంటే అడివిలో చిక్కుకుపోతాంవని మందని మల్లించేసాను" ఎట్టకేలకు చిన్నగా చెప్పాడు అప్పన్న.

"ఏడిసావ్! అంబోతులాంటి బొకడ పోతు ఏంవైందో?– ఏంవిటో చూడకుండా ఈ చచ్చినదాన్ని తీసుకువచ్చావ్. ఇప్పుడు దీన్ని ఏంచేస్తాం? పోన్లే, దీన్లో మాంసం ఉందా? అంటే అదీ లేదు. అసలు ఇంతకీ–బొకడ సంగతేంటట?"

"ఇప్పుడు తిండి తిని లాంతరెట్టు కెళ్తానయ్యా!"

"ఎలాగో తగలడు. నాకు మాత్రం ఉదయానికల్లా ఆ బొకడతో కనిపించాల నువ్వు."

"సరే" నంటూ తలవూపి వచ్చేసాడు అప్పన్న.

"అరేయ్ అప్పన్నా! ముందు నువ్వు తిండి తినేసి చుక్కలోడి ఇంటికెళ్ళి మన దగ్గర మేక ఉందని, కావలిస్తే రమ్మని– తెల్లవారుజామునే వచ్చెయ్యమను. ఆలస్యమయితే ఇది పాడయిపోతుంది."

"అలాగే!" తలవూపుతూ అనుకున్నాడు. 'చచ్చిన మేక'ని కూడా సొమ్ము చేసుకుందామని గావాలి! అసలు వచ్చినా వందో– ఏభయ్యో వస్తుంది. ఆ చుక్కలోడు ఇచ్చేది తక్కువ. అడు అమ్ముకొనేది చిల్లర వంతులు కదా! ఎక్కువే వస్తుంది. అసలు చచ్చిన మేక మాంసం అని తెలిస్తే ఎవరు కొంటారు?

భోజనం చేసినప్పుడు తన బాధనంతా ఏకరువు పెట్టింది సూరమ్మ. అంతవరకూ దిగమ్రింగుకున్న దుఃఖాన్ని వెళ్ళగక్కేసింది. భార్య ఆవేదన అర్థం చేసుకున్న అప్పన్న అన్నాడు, "మనం తల అమ్ముకున్నోళ్ళంవే! తలదించుకు నిలబడ్డంత మాత్రాన మన కేంవీ చిన్నతనం కాదు. నేను కొండకాసి ఎళ్ళాల. నువ్వు తలుపులు వేసుకు పడుకో.

తన యజమాని చెప్పిన కబురు చెప్పేసి చాకరేవు కొండవైపు బయలుదేరాడు.

చుట్టూ కటిక చీకటి. ఉండుండి గుడ్ల

గూబలు అరుపులు. చాలా భయంకరంగా ఉంది. వాతావరణం. కానీ, అప్పన్న దేన్నీ పట్టించుకోలేదు. అప్పన్న ఆలోచనల్నీ సాయంత్రం జరిగిన సంఘటన మీదే కేంద్రీకృతమై ఉన్నాయి.

'పొడమేకని మెఖం పొట్టన బెట్టుకుంది. దాన్లో తన తప్పేంవుంది? ప్రతీ మేకనీ కాపు కాయలేను కదా? మందనయితే అడవికి తోలుకెళ్తాను. తిరిగి మల్లిస్తాను గానీ ఏ మేక మేస్తోందో_ ఏది మెయ్యలేదో గమనించలేనుకదా?!

మధ్యన ఈ ఎదవ బొకడ ఒకటీ! ఎంవైందో? ఎక్కడ చచ్చిందో? కొంపదీసి దీనిక్కూడా మెఖం మేసేసిందా? ఇంకేంవన్నా ఉందా? నాలుగయిదొందలు ఖరీదుచేసే బొకడగాని చచ్చిపోతే తన్ని ఉంచుతాడా తన యజమాని?'

ఆ ఆలోచన మెదిలేసరికి గబగబా అడుగులు వేయసాగాడు అప్పన్న.

కొంతదూరంనుంచి ఒక ఆకారం మెల్లిమెల్లిగా కుంటుతూ తనవైపే రావడం గమనించాడు అప్పన్న. మరింత పరిశీలనగా చూసాడు.

'బొకడపోతు. సందేహంలేదు బొకడపోతే! కుంటుకుంటూ వస్తోంది బొకడ!' మనసులోనే అనుకున్నాడు. అతన్ని పట్టలేని ఆనందం ఆవరించుకుంది. సంతోషం ఉక్కిరిబిక్కిరి చేసేస్తోంటే పరుగు పరుగున వెళ్ళి దాన్ని కలుసుకున్నాడు. ఆనందంగా దాని పీకని వాటేసుకున్నాడు అప్పన్న.

ఎదురుగా వస్తున్న వెలుతురు రవ్వ పరుగుపెట్టేసరికి చెవులు రిక్కించుకు నిలబడిపోయింది బొకడపోతు. ఆ వెలుతురులో తన యజమాని కన్పించేసరికి పరుగుపరుగున ఎదురువెళ్ళింది. దానికి ఆ సమయంలో కాలుబాధ తెలీలేదు

అప్పుడు_ఆ తర్వాత చూశాడప్పన్న, బొకడ ఎందుకు మెకుక్కతున్నదీ కనుక్కుందామని వొంగొని కాళ్ళవైపు _ చూశాడు. ముందర రెండుకాళ్ళల్లో ఒక దానికి గాయమై ఉంది. రక్తం ధారలా కారుతోంది. గభాలున తలపాగా విప్పేసి రక్తం కారకుండా దాని కాళ్ళను గట్టిగా కట్టాడు.

ఆ మూగజీవి తన బాధని_తను పడ్డ శ్రమని చెప్పుకోలేకపోయినా అప్పన్నకి అర్థమయిపోయింది.

పొడమేకని మెఖం చంపుకు తింటున్నప్పుడు చూసిన బొకడపోతు ఆ మెఖంతో పోరాడి దాన్ని తరుముకుంటూ వెళ్లుంటుదని గ్రహించగలిగాడు. అలాంటప్పుడే మెఖం దీనిపైబడి కరిచినట్లుంది' అనుకున్నాడు అప్పన్న.


అది నిజంవన్న విషయం ఆ బొకడపోతుకే తెలుసు.

* * *

ఆ రోజు _

తన పనంతా పూర్తిచేసుకొని ఎనిమిదయ్యేసరికి మందని అడవికి తోలుకు






వెళ్ళడానికి బయలుదేరాడు అప్పన్న. అంతలోనే తన పెళ్లాంద్వారా యజమాని కబురుపెట్టేసరికి వెళ్ళి కలుసుకున్నాడు.

"ఇకనుండీ రోజూ రాత్రుల్లు మన అనాసతోటలో పడుకోవాల్రా! ఇది అనాస కాయల సీజను కదా! దొంగలంజకోళ్ళ_కొండవెధవలు కోసుకుపోతారు. ఇవాళ నువ్వు మందనుండి వచ్చిన వెంటనే తిండి తిని తోటలోకి వెళ్ళిపో!"

యజమాని చెప్పింది విని తలవూపుకొని యాంత్రికంగానే మందతో బయలుదేరాడు అప్పన్న.

'అనాసతోటలో కాపంటే - దేంవుడికొండ ఎక్కాలి. ఈ కొండనుండి కాళ్ళు చచ్చుబడి దిగివస్తాడు. ఆ వెంటనే దేంవుడికొండ కెళ్లాలి' మనసులోనే మననం చేసుకున్నాడు అప్పన్న.

గుడిసెలో ఇవాలనుండీ సూరమ్మ ఒక్కర్తీ పడుకోవాల? పాపం! అదొక్కర్తీ ఎలా పడుకుంటుందో? ఏంమో?

ఆ రోజంతా అన్యమనస్కంగానే సాయంత్రవరకూ అడవిలో గడిపాడు. మందని మళ్లించి ఇల్లు చేరుకున్నాడు.

మేకలమందని శాల్లోకి తోలి తడికేసి గుడిసెలోకి పోయి, విచారంగా కూర్చున్నాడు అప్పన్న.

'దేవుడికొండకి ఇప్పుడు తిండి తిని ఎలావెళ్ళడం? ఇప్పటికి ఉదయంనుండీ ఆయసుప లేకుండాపోయింది. ఎదవ ఒక దగ్గర ఉండి ఛస్తేనా? అడవంతా త్రిప్పించాయి. ఈరోజు మందని మల్లించేసరికి తలప్రాణం తోక్కొచ్చింది. మందని మల్లించేసరికి ఎంత కష్టమనిపించింది?

ఇటు తోలితే అటూ_అటు తోలితే ఇటూ _ ఈ మేకలకంటే గొర్రెలు

నయం. ఉంటే అన్నీ ఒక్కదగ్గరే ఉంటాయి. మేస్తే ఒక్కదగ్గరేమేస్తాయి' ఆలోచిస్తూ అలాగే నడుం వాల్చాడు అప్పన్న.

నులకమంచం నుసికి – నొప్పికి ఎవరో మర్దనచేస్తున్నట్లనిపించింది అప్పన్నకి.

అసలు సూరమ్మని వొదిలి వెళ్ళడానికి మనసొప్పలేదు అప్పన్నకి.

అవును ఎలా వెళ్తాడు? అప్పన్న ఏఁవైనా ముసలోడా? పాతికేళ్ళ వయసుగల పడుచుజంట. పెళ్ళయి మూన్నాళ్ళు కాకుండానే విడిగా ఉండమంటే ఉండగల్రా?

అదే కుర్రవయసు అప్పన్నని చిత్రవధ చేస్తోంది.

ఇటు యజమాని ఆదేశం – అటు మనసు ఆరాటం.

వెట్టిచాకిరీ బ్రతుక్కి అతుక్కుపోయిన అప్పన్నేం చేయగలడు? మనసు చంపుకొని మనడం తప్ప వేరే మరేం చేయగలడు?

ఆ రాత్రంతా అనాసతోటతో సూరమ్మ ధ్యానలోనే గడిపాడు అప్పన్న. అతనితో పాటు ఆ చుట్టుప్రక్కల తోటలను కాపు కాయడానికి వచ్చిన అప్పన్నలాంటి వాళ్ళంతా ఒక్క దగ్గర చేరి కబుర్లు చెప్పకుంటూ గడిపేశారు.

తెల్లవారుఝామున వస్తూనేగుడిసెలోకి పోయి ముసుగుతన్ని పడుకుండిపోయాడు అప్పన్న. భర్తవచ్చిన అరగంట పోయిం తర్వాత లేచి ఇంటిపని – వంటపని పూర్తయిం దనిపించి యజమానిగారింటి పనికి వెళ్ళిపోయింది సూరమ్మ. రాత్రంతా నిద్ర ఉండిఉండదన్న ఉద్దేశ్యంతో అప్పన్నను లేపటం మానేసింది.

ఎండ నడినెత్తికెక్కేసరికి మెలకువ వచ్చింది అప్పన్నకి. అప్పటికి పది దాటిపోయింది. బద్ధకంగా లేచి పందుంపుల్ల తీసుకొని గడ్డిమేటు దగ్గరకి వెళ్ళాడు అప్పన్న.

అప్పుడే నిద్రలేచి బైటకు తోటలోకి వెళ్ళవస్తున్న నూకరాజు – అప్పన్నని చూస్తూనే చిర్రుబుర్రు లాడాడు.

"ఏరా! ఇవాళ మేకలకి పస్తేనా?! ఎన్నడూ లేనిది దొరగారు ఇవాళ ఇంత ఆలస్యంగా లేచారేఁవిటీ? పెళ్ళాం మోజులో ముసుగుతన్ని పడుకున్నావేఁవిటి?

"మనం గిన్నెడు మెక్కగానేసరికాదు. ఆ నోరులేనివి ఏఁవిటి తింటాయని అడవికి తోలుకెల్లడం మానేశావ్?! అప్పుడేనీ కూడా జిడ్డు బలిసిపోయిందన్న మాట. నిన్ననేపని లేదురా! నాది – నాదిరా బుద్ధితక్కువ. దిక్కుమాలిన లంజాకొళ్ళని నెత్తినెక్కించుకొంటే ఇలాగే ఉంటది" అని తిట్టుకుంటూ వెళ్ళిపోయాడు నూకరాజు

తన యజమాని ఎన్నిమాటలు అన్నా వినీవిననట్టు తలవంచుకొని పందుంపుల్ల కుంచలా నములుతూనే నిలబడిపోయాడు అప్పన్న.

నూకరాజు తిట్టిన తిట్లకి పూర్వం అయితే పట్టించుకొనేవాడు కాదు. కానీ ఇప్పుడు అతనూ ఓ ఇంటివాడే. ఓ ఇంటికి – ఇల్లాలికి యజమానే. అతనిలోనూ చీమూనెత్తురూ ఉంది.

నూకరాజు అన్న ప్రతీ మాటా అప్పన్న గుండెల్లో సూటిగా నాటుకుండిపోయింది. కానీ, ఏం చేస్తాడు? ఏం చేయగలడు?

అప్పుడే చూసాడు. తలఎత్తి ఎదురుగా చేతితో చెత్తపట్టుకొని నిలబడ్డ భార్యని చూశాడు.

'ఇప్పుడు జరిగిన సన్నివేశం అంతా నేనూ చూసాను' అనడానికి సాక్ష్యంగా ఆమె కళ్ళల్లో నీళ్ళు గిర్రున సుళ్ళు తిరిగాయి. అప్పన్న మనసు కలుక్కుమంది.

మొహం కడుక్కోవడం పూర్తయిన వెంటనే 'దొని' (చెట్టుపై గల ఆకుల్ని క్రిందనుండే కోసేందుకు ఉపయోగించే సాధనం) పట్టుకొనివెళ్ళి రెండుమోపుల రావిఆకులు తీసుకువచ్చాడు అప్పన్న. మేకలమందని ఉంచిన శాల్లో ఆ రెండు మోపుల ఆకులూ పడేసి – గోళాంతో నీళ్ళుకూడా పెట్టి బైటకొచ్చాడు.

అంతలోనే అప్పన్నని కేకేస్తూ పోస్ట్‌మేన్ అప్పలస్వామి వచ్చాడు. వస్తూనే నూకరాజు దగ్గరకు వెళ్ళాడు పోస్ట్‌మేన్. ఏఁవిటో – ఎందుకో అర్థం కాని అప్పన్న ఆత్రుతగా అక్కడకు వెళ్ళాగు. అప్పటికే తన పేరున వచ్చిన రిజిష్టరు పోస్టు కవరు సంతకంపెట్టి తీసుకున్నాడు నూకరాజు.

"ఇదిగో – నువ్వు ఇక్కడ నిశాని వెయ్యి." అప్పన్నచేతికి ఇంకో కవరిచ్చి స్టేంప్ పాడ్ అందించాడు పోస్ట్‌మేన్ అప్పలస్వామి.

"ఎందుకూ – ఎందుకు సాఁవిగారూ!"

"మన అనాసతోటల గురించిరా! వెయ్యి." నూకరాజే కల్పించుకొని అన్నాడు. యజమాని సమాధానం విని మరి మారుమాట్లాడలేదు అప్పన్న. ఆ కవరు ఏఁవిటో – ఎందుకో అర్థమయిపోయింది. కానీ, దేనికో అర్థంకాలేదు అప్పన్నకి.

పోస్ట్‌మేన్ వెళ్ళిపోయిన తర్వాత నెమ్మదిగా అడిగాడు అప్పన్న.

"దేనికయ్యా ఈకవరిప్పుడొచ్చింది."

తల గోక్కుంటూ అన్నాడు.

"రేపు అనాసతోటల అధికార్లు వస్తారట. మనల్నందర్నీ పంచాయితీ ఆఫీసు దగ్గర పదికల్లా ఉండమన్నారు. నువ్వు రేపుకూడా అడవి కెళ్ళకు."

'ఎందుకూ – ఏఁవిటీ' అని మరడగలేదు అప్పన్న.

అప్పన్న చేతిలో ఉన్న కవరు తీసుకొని బీరువాదగ్గరకు వెళ్ళాడు నూకరాజు.

"నేను గుడిసెకు పోతానయ్యా!" నెమ్మదిగా అన్నాడు అప్పన్న.

"ఊఁ! సాయంత్రం వేగంగా లేచి మేకలకి ఆకులూ గడ్డీ సంపాదించి ఉంచు" వెనుతిరక్కుండానే అన్నాడు నూకరాజు.

గుడిసెలో....!

నులకమంచంమీద వెల్లకిలా పడుకొని గుడిసె పైకప్పుకేసి చూస్తూ ఆలోచిస్తున్నాడు అప్పన్న. అతని ఆలోచన్లు మూడేళ్ల క్రిందకు మళ్లాయి.

ఆ ఆలోచనలన్నీ అనాసతోటలు - కవర్లు - ఇలాంటి సంతకాల కవర్ల గురించే ఆలోచిస్తున్నాడు అప్పన్న.

*　　*　　*

మూడేళ్ళనాటి మాట —

అడవినుండి మందని మళ్లించి ఇల్లు చేరుకున్నాడు అప్పన్న. అప్పటికింకా అప్పన్నకి పెళ్ళికాలేదు. ఆసరికి అప్పన్న కోసం ఎదురుచూస్తున్న నూకరాజు - అప్పన్నని కేకవేసి పిల్చాడు.

బల్లమీద కాగితాలు ముందరేసుకొని కూర్చొని ఉన్నాడు నూకరాజు. ద్వారం దాటి లోపలకు వస్తూ అన్నాడు అప్పన్న.

"ఏఁవయ్యా! పిల్చావు?" తలపాగా చుట్టుకుంటూ అన్నాడు అప్పన్న.

"ఏఁవీలేదురా! ఇక్కడ నీ సంతకం వేయించుకుందామని."

"ఎందుకయ్యా!.... ఏఁవిటీ?" ఆత్రంగా — నవ్వుమొహంతో అన్నాడప్పన్న. 'ఇనాళ్లకి — ఇన్నేళ్లకి తన సంతకం - తన అవసరం కావలసి వచ్చింది. ఎవరికోకాదు తన యజమానికి. ఆ ఆనందం తట్టుకోలేకపోతున్నాడు అప్పన్న.

"గవర్నమెంటోళ్ళు ఒకో మనిషి పేరునా ఒకో ఎకరం భూమి దేఁవుడికొండ మీద ఇస్తున్నారు. నీ పేరునకూడా ఒక ఎకరానికి పెడదామని."

"అదెందుకయ్యా?!"

"ఎందు కేఁవిట్రా? అనాసతోట వెయ్యాలి. అనాసతోటలు పండేదికూడా ఎక్కడనుకున్నావు. కొండప్రాంతంలోనే కదా! అందుకని ఒకో రైతుకూ ఒకో ఎకరం ఇస్తూ మూడువేలు రూపాయలు అప్పుక్రింద గవర్నమెంటే ఇస్తుంది. పంట చేతికందిన తర్వాత ఆ అప్పు సక్రమంగా జమచేసేస్తే ఆ భూమి కూడా మనకే దక్కుతుంది. పట్టాకూడా రాసి ఇస్తారు."


"........" నవ్వుతూ అంతా విని నిశాని వెయ్యమన్నచోట వేసేశాడు అప్పన్న.

"రేపు బ్యాంకు ఆఫీసర్లు వస్తారు. సాయంత్రం వేగంగా మందనుంచి వచ్చెయ్!"

"అలాగే!" అంటూ వచ్చేశాడు అప్పన్న.

ఆ తర్వాత మూడు సంవత్సరాలు అయిపోయిన తర్వాత మొదటిపంట చేతికందినప్పుడు అప్పన్న పేరున ఓ రిజిష్టరు కవరు వచ్చింది. ఆ తర్వాత మరోమూడు కవర్లు వచ్చినప్పుడు భయంతో అప్పన్న





గాబరాపడిపోయాడు. తన యజమాని మాటవిశ్వాసంపోయి పోస్ట్‌మేన్ అప్పలస్వామిని అడిగాడు అప్పన్న.

"గవర్నమెంటువాళ్ళు ఇచ్చిన భూమి, అప్పు నీపేరనే ఉందని- ఆ బాకీచెల్లించే బాధ్యతయినా, హక్కు అయినా అప్పన్నకే ఉందని పోస్ట్‌మేన్ అప్పలస్వామి చెప్పినతర్వాత చాలాసార్లు ఆ అనాసతోట అప్పు గురించి తన యజమానితో ప్రస్తావించాడు అప్పన్న. అలా ప్రస్తావించమని సలహా ఇచ్చిందికూడా పోస్ట్‌మేన్ అప్పలస్వామే!

"నీ పేర భూమి ఉన్నప్పుడు నిన్ను పట్టుకుంటారు తప్ప అతన్ని ఎందుకు అడుగుతారు? ఎప్పుడైనా ఆ అప్పుకు బాధ్యుడవు నువ్వే! ఇవాళ కాకపోయినా రేపైనా గవర్నమెంటు తన అప్పు తను వసూలు చేసుకోవడానికి ఎన్ని ప్రయత్నాలయినా చేస్తుంది. ఆఖరికి నీ ఇల్లు, ఆస్తి జప్తుచేసైనా అప్పు వసూలుకు ప్రయత్నం సాగిస్తుంది.

"ఎందుకయినా మంచిది ఒకసారి ఈ విషయం మీ అయ్యని అడిగి చూడు."

ఆ రోజు పోస్టుమేన్ అప్పలస్వామి గీతోపదేశానికి అర్జునుడిలా చేతులు జోడించి నమస్కారం చేస్తూ కూర్చుండి పోయాడు.

* * *

సూరమ్మ కుదుపులకు కళ్లు తెరిచాడు అప్పన్న. ఆలోచిస్తూ - ఆలోచిస్తూ ఎప్పటికి నిద్రపోయాడో తెలీదు. కళ్ళు తెరిచి చూసేసరికి మంచం ప్రక్కన భార్య సూరమ్మ నిలబడిఉంది. ఎందుకో కడుపులో మంటగా అనిపించింది అప్పన్నకి. తను మధ్యాహ్నం తిండి తినలేదన్న విషయం గుర్తొచ్చి చిర్రెత్తు కొచ్చింది కోపం. ఎదురుగా సూరమ్మని చూసేసరికి ఒళ్లు మండుకొచ్చింది అప్పన్నకి.

"తిండికి లేపడానికి ఏఁవొచ్చింది నీకు!"

"బాది-బాది విసిగిపోయి అకలైతే నువ్వే లేస్తావని ఊరుకున్నాను-"

"- లేఁవయ్యా! ఏఁవిటా మొద్దునిద్ర. అవతల ఆ ఏటగాళ్ళు (పోతుల్ని కొని తామే నరికి మాసం అమ్మేవాళ్ళు)కూర్చున్నారు."

"ఎందుకూ?!" కసురుకున్నాడు అప్పన్న.

"ఎందుకేటి? మేకపోతుని కొనుక్కున్నారు. దాన్ని తీసుకు వెళ్ళడానికి!"

"ఏ పోతూ....?!"

"బొకడ - బొకడపోతు తెలీదా? ఇంకే పోతుందని పోతానంటున్నావ్?'"

"అమ్మేశారా?!"

"ఆఁ! కొనుక్కున్నారు కాబట్టే దాన్ని తీసుకెళ్దామని దగ్గరకు వెళ్లారు. ఒక్కోడికీ నాలుగు పోట్లు పొడిచింది. పాపం - ఎవరూ దాని జోలికి పోలేక పోయారు." నవ్వాపుకుంటూ అంది సూరమ్మ.

"........" మౌనంగా లేచాడు అప్పన్న.

"ఏగంగా ఎల్లి దాన్ని అల్లకు అప్పగించేసిరా. అయ్యగారుకూడా కసురుకుంటున్నారు. ఎల్లు." గుడిసెలోనుండి బైటకు తోస్తూ అంది సూరమ్మ.

బొకడపోతును తీసుకొని ఆ ఏటగాళ్ళతోపాటు ఇంటివరకూ తోలుకెళ్లాడు అప్పన్న. అప్పటికే అక్కడ బాసా, కత్తీ గట్రా సిద్ధంచేసి ఉంచారు. వీళ్ళు వెళ్ళిన వెంటనే ఒకడు బొకడపోతు వెనుక రెండుకాళ్ళూ ఒడిసిపట్టుకున్నాడు. రెండోవాడు అప్పన్న చేతిలోఉన్న మెడ కన్ని (మెడకు కట్టే త్రాడు) పట్టుకొని ముందుకు బలంగా లాగుతూ నిలబడ్డాడు.

వెనకవ్యక్తి కాళ్ళూ-ముందు వ్యక్తి మెడకు కట్టిన కన్నీ బలంగా లాగుతూ నిలబడేసరికి ఎటూ కదలకుండా -కదల్లేకుండా శిలలా నిలబడిపోయింది బొకడ పోతు అనబడే మేకపోతు.

మూడో వ్యక్తి ఏటకత్తి ఎత్తి మూడుసార్లు క్రిందకూ మీదకూ ఎత్తి ఒకే ఒక్క బలమైన దెబ్బ మెడమీద వేశాడు. ఆ కత్తిదెబ్బకు మొండెంనుండి బుర్ర వేరయ్యింది. ఓ రెండు నిముషాల పాటు కాళ్లు కొట్టుకొని - కొట్టుకొని ప్రాణం వదిలింది బొకడపోతు.

దాని తలమీది కత్తివేటు పడ్డప్పుడు- అప్పటికే తన చావు దానికి అర్థమయే సరికి ఒకసారి బేలగా అప్పన్న కళ్ళల్లోకి చూసింది. దాని కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరిగాయి.

ఆ దృశ్యం చూసిన అప్పన్నకి మనసు ముక్కలయిపోయింది.

దాని స్థానంలో తనే ఉంటే ఎలా ఉండేదో ఊహించుకొనేసరికి శరీరం గగుర్పొడిచింది అప్పన్నకి.

తనమీద విశ్వాసంతో - భక్తితో తన ప్రాణం అతని చేతుల్లో పెట్టి కళ్ళు మూసుకుందా మూగజీవి.

అదే దుస్థితి మనిషికీ సంభవిస్తే-?!

* * *

ఆ మరునాడు -

పంచాయతీ ఆఫీసులోని మీటింగ్‌కు సమితి ఆఫీసర్లు, ఆర్థికసహాయం చేసిన బ్యాంకు ఆఫీసర్లు, ఇతర ప్రముఖులూ అందరూ హాజరయ్యారు.

రైతులందరూ కూడా హాజరై మీటింగ్ హాల్లో ఆశీనులై ఉన్నారు.

ఆ మహాసభ రైతులందర్నీ ఉద్దేశించి పెట్టిన సభ కావడంచేత అంతా వాళ్ళ కష్టసుఖాలు గురించి మాట్లాడుతూ ముగించారు. ఆ సభ ముగిసేముందు బ్యాంకు ఆఫీసర్లు చేసిన హెచ్చరిక మాత్రం అప్పన్న మనసులో నాటుకు పోయింది.

"మీకు భూమనిస్తూ - అప్పులిచ్చింది ఎందుకు? మీరు బాగుపడి - దేశాన్ని బాగుచేస్తారని. మీరు బాగుపడితే దేశం ఆర్థికంగా మెరుగుపడట్టే కదా!

"మా దగ్గర ఏదో సొమ్ము మూలన మూలుగుతుందని కానీ, మీ రిచ్చే వడ్డీల మీదే బ్యాంకు ఆధారపడి ఇచ్చిందనిగానీ అపోహ పడకండి. మీకు అప్పులిచ్చి అన్ని సౌకర్యాలూ సమకూర్చింది- కేవలం దేశానికి వెన్నెముకలై మీరు బాగుపడాలని.

మీరు కూడా మీ-మీ బాధ్యతలు నెరిగి పంట చేతికందిన వెంటనే పంటఅమ్మిన మొత్తంలో సగం మాత్రం అప్పుక్రింద జమచేయండి. మిగిలినది మీ ఇంటి ఖర్చులక్రింద వాడుకోండి. కానీ, అసలు

పైసా కట్టకుండా ఎగవెయ్యడానికి - గవర్నమెంటు సొమ్మేకదా కట్టక పోయినా అడిగే నాధుడు లేడని భ్రమపడి జమచేయడం మానకండి. ఆ అప్పుల విషయాలలో మీ ఇల్లు-ఆస్థులు సమస్తం జప్తుచేసేవరకూ వస్తుంది. దయచేసి మమ్మల్ని మీ ఇంటివరకూ రానివ్వకండి!"

ఆ వారం తర్వాత —

అనాసతోటలో మొదటిపంట దిగినపుడు ఇంటికి ఆరుకాయలు తెస్తూ సూరమ్మకి ఒకటి ఇచ్చి మిగిలిన అయిదు పళ్ళూ యజమానురాలికి అందించాడు అప్పన్న.

బజార్లో మొదటిపంటలో దిగిన అనాసపళ్ళు అన్నీ వందల ప్రకారం తట్టల కెక్కించి అమ్మేసి ఇంటికి చేరుకున్నాడు నూకరాజు.

"ఏమేవ్!? ఇప్పుడు అప్పన్నగాడు తెచ్చిన అనాసపళ్ళు ఆరూ మనకనుకొని కోసెయ్యకు. పంచాయితీ ప్రెసిడెంటుగారింటికి పంపాల!" ఆయాసంతో కూర్చుంటూ అన్నాడు నూకరాజు.

"ఆరేటి -? అయిదు. అదిగో అక్కడ పెట్టాడు. తీసుకుపోండి" మూతి మూడువంకర్లు త్రిప్పుతూ అంది అతని భార్య.

"అయిదా? ఆరు కదా పంపించాను" గొణుక్కున్నాడు నూకరాజు.

"ఆ ఒకటీ తన ముద్దుల పెళ్ళానికి ఇచ్చాడు. వెళ్ళి అడగండి."



"అమ్మా ఓయమ్మా! ఎంతకైనా తెగిస్తాడే!?" కోపం పట్టలేకపోయాడు నూకరాజు.

అప్పుడే అక్కడకు వస్తున్న సూరమ్మ భార్యాభర్త లిద్దరూ అనుకున్న మాటలన్నీ వింది. తిన్నగా వెళ్ళి గుడిసెలో ఉన్న అనాసపండు తీసుకువచ్చి అయిదుపళ్ళున్న దగ్గర పెట్టి వెళ్ళిపోయింది. అదంతా బల్లమీద కూర్చొని చూస్తున్న నూకరాజు కళ్ళు ఎర్రబడ్డాయి. కానీ, ఏమీ అన్లేదు.

ఆ సాయంత్రం మందనుండి వస్తూనే యజమాన్ని కలిసాడు అప్పన్న.

"ఎందుకయినా మంచిది! ఆ గవర్నమెంటోళ్ళ బాకీకి కొంతసొమ్ము కట్టెయ్యండయ్యా!" అన్నాడు.


"నీ కెందుకురా? వెధవ బోడి సలహాలూ-నువ్వూనూ" అని కొట్టిపారేసి బజార్లోకి వెళ్ళిపోయాడు నూకరాజు.

ఆ అనాసతోట పంటసీజను అయిన మరుసటి వారమే జప్తుకు వచ్చారు బ్యాంకు వాళ్లు. ముందుగా నూకరాజును కలసి అప్పన్న గుడిసెదగ్గరకు వచ్చారు.

"ఈ జాగా నాదండీ. గుడిసె ఏసుకుంటానంటే దయతలచి ఇచ్చాను. ఇంక ఈ ఇంట్లో ఏ వస్తువుతోటీ నాకు సంబంధం లేదు." అంటూ తన ఆస్థివివరాలు చెప్తున్నాడు నూకరాజు.

ఈ హడావుడికి సూరమ్మ పనిచేసుకుంటున్నదల్లా గుడిసెదగ్గరకు వచ్చింది.






అప్పుడే మందతో బయలుదేరడానికి సిద్ధమవుతున్న అప్పన్నకి నోటమాట రాలేదు. శిలాప్రతిమలా నిలబడిపోయాడు.

గుడిసెలో ఉన్న సమస్త వస్తువులు జాబితా వ్రాసుకొని తీసుకు వెళ్ళిపోయారు బ్యాంకువాళ్ళు. పూచికపుల్ల కూడా విడవకుండా తీసుకుపోతూ అప్పన్నచేతిలో ఒక నోటీసు కాగితం పెట్టి మరీ వెళ్ళిపోయారు.

ఆ నోటీసులో బ్యాంకు చట్టం ప్రకారం చేస్తామని - వాటి తాలూకా నియమ నిబంధనలకు మీరు బద్ధులు కావాలని హెచ్చరిస్తూ తెలియజేయబడింది.

గుడిసె నూకరాజు ఆస్థికావటం మూలాన దాన్ని వాళ్ళు సీలుచేయలేదు.

ఆ రాత్రంతా భార్యా-భర్తలిద్దరూ నిద్రలేకుండా గడిపారు.

'ఎంతో ముద్దుగా - ముచ్చటతీరా తమ సంసారంకోసం సరంజామా అంతా సర్దుకుంది ఇన్నాళ్ళూ. దాన్ని ఈరోజు వీళ్ళు గద్దలా తన్నుకుపోయారు. అది వాళ్ళ తప్పుకాదు. మరెవరిది? ఆ తప్పెవరిదో వాళ్ళకు తెలుసు. కానీ, సంఘం దృష్టిలో-చట్టందృష్టిలో వాళ్ళే దోషులు. గవర్నమెంటువారు ఇచ్చిన ఋణాన్ని జల్సాచేసి జబర్దస్తీగా తిరిగేస్తున్న పుండాకోరులు వాళ్ళే.

అందుకే అప్పన్న శిలాప్రతిమలా నిలబడిపోయాడా క్షణం.

ఆ రాత్రంతా అప్పన్నని నానా దుర్భాషలాడింది సూరమ్మ. అతని చేతకానితనాన్ని, అమాయకత్వాన్ని పొడిచి-పొడిచి చంపేసింది.

అ మరునాడు —

తూర్పు నెమ్మదిగా ఎర్రబారుతోంది.

అప్పన్న లేస్తూనే భార్యతో చెప్పాల్సిందంతా చెప్పి మందతో బయలుదేరడానికి సిద్ధమయ్యాడు. అప్పుడే నూకరాజు నుండి కబురువచ్చేసరికి వెళ్ళక తప్పదని వెళ్లాడు అప్పన్న.

"ఒరేయ్ అప్పన్నా ! అయిందేదో అయిపోయింది. వెధవ సామాన్లు పోతే పోనీ. మళ్ళా సంపాదించుకోవచ్చు." అన్నాడు నూకరాజు.

అతనిముందు అప్పన్న చేతులుకట్టుకు నిలబడలేదు. చేతులు నులుముకు నిలబడలేదు. నిర్వికారంగా ఏదో ఆలోచిస్తూ నిటారుగా నిలబడ్డాడు. అప్పన్న కళ్ళల్లోకి తేరపార చూసాడు నూకరాజు.

ఎర్రగా మండుతున్నాయి అప్పన్న కళ్ళు. కానీ, బాధ గుండెని పిండుతుందేమో అ ఎర్రబడ్డ కళ్ళెంబడి నీళ్ళు ధారాపాతంగా జాలువారుతున్నాయి.

"నా పెళ్లాం వస్తుంది దానికో పదిసేర్లు బియ్యం ఇప్పించండి !" వేడుకోలేదు. మామూలుగానే అన్నాడు అప్పన్న.

"అమ్మగార్ని అడిగి తీసుకుపొమ్మను. నువ్వు మందతో పో !"

నూకరాజు మాటపిని వెనుదిరగలేదప్పన్న. తన మానాన తను వెనక్కి తిరిగి వచ్చేసి మందని తోలుకొని బయలుదేరాడు.


భర్త చెప్పిన ప్రకారం తొమ్మిదయ్యేసరికి చాకిరేవు కొండదగ్గరకు చేరుకుంది సూరమ్మ. ఆమెచేతిలో పదిసేర్లబియ్యం— ఒక తపేలా — చిన్న మూటా ఉన్నాయి.

భార్యా - భర్త లిద్దరూ మందని తోలుకుంటూ చాకిరేవుకొండ దాటిపోయారు. అలా కొండల్ని దాటుకుంటూ అడవి మార్గాన్నే ప్రయాణం సాగిస్తున్నారు.

"ఆ నూకరాజుగాడికి - అది మనుషులకి అందనంత దూరం పారిపోవాలి !" అదే భార్యా - భర్త లిద్దరి ఆలోచన.

ఆలోచిస్తూ నడుస్తున్న అప్పన్నకు ఒకానొకప్పుడు బొకడపోతు తన యజమాన్ని పొడిచిన సంఘటన గుర్తుకొచ్చేసరికి నవ్వు పుట్టుకొచ్చింది.

ఆ రోజు తను దాన్ని కసాయివాళ్ళకు అప్పగిస్తున్నప్పుడు అది తన్నికూడా పొడిచిఉంటే — ? ! కాళ్ళతో తన్నేసి ఉంటే.... ? ? అప్పన్న శరీరంలోని రక్తం గడ్డకట్టుకుపోయింది.



# వారుణి



## యామినీ సరస్వతి

(గత సంచిక తరువాయి)

రోజూ లాగే కూర్చుని దారివెంట వెళుతున్నా, థియేటరు నుంచి ఇంటికి వచ్చిపోయే జనాన్ని చూస్తోంది. ఏమిటో యినా ఒకటే పరుగు! పరుగు! పరుగు! హడావిడి. బజారు కెళుతున్నా, బజారు ఎక్కడికీ పరుగు పందాలు? నుంచి ఇంటిముఖం పట్టినా, సినిమాకు జీవితంలో ఈ వేగం వల్లనే